క్లుప్తంగా

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకం అందిస్తున్న దాత

విజయపురం: మండలంలోని మహారాజపురం, కేశవపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ హెచ్ఎం చంద్రయ్య, ఉపాధ్యాయుడు దొరస్వామి మంగళవారం నోటుపుస్తకం పంపిణీ చేశారు. దాతలు అందించే విద్యా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తమ పిల్లలను ప్రభుత్వం పాఠశాలలోనే చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మణి, సుష్మ, అంగన్‌వాడీ టీచర్ సరసమ్మ, పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం శివ

పాలసముద్రం: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పంచాయతీ కార్యదర్శి ఇందిర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ తెలిపారు. మంగళవారం వెంగళరాజుకుప్పం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విచ్చేసిన హెచ్ఎం శివ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహారం అందుతుందని తెలిపారు. వీటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ దీప, నాగవేణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసలు



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు, అధ్యాపకులు

నగరి: కాకినాడ జిల్లా అన్నవరంలో నిర్వహించిన అంతర్‌జిల్లాల 9వ సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులను మంగళవారం అభినందించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టులో ప్రతిభ కనబరచి స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు దక్కించుకున్న కేసీ తేజేష్, క్రీడాకారుడు ఇక్బాస్‌లను వారు విద్యనభ్యసించే సాయి వివేకానంద జూనియర్ కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు సన్మానించారు.. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను అభినందించి జాతీయ స్థాయిలో రాణించాలని ఆశీర్వదించారు.

స్వచ్ఛభారత్‌కు శ్రీకారం చుట్టండి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

విజయపురం: ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్‌కు శ్రీకారం చుట్టాలని శ్రీహరిపురం హెచ్ఎం జ్ఞానప్రకాష్ అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ముందుగా గ్రామాల్లో స్వచ్ఛభారత్ ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబు, ఉపాధ్యాయులు వెంకమరాజు, విజయకుమార్, గోపి, విజయవర్మ, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

శ్రీరంగరాజపురం: వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని ఎస్ఐ సుమన్ అన్నారు. మండలంలో చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి క్షీరసముద్రం గ్రామం వద్ద వాహనలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, మద్యం మత్తులో వాహనాలను నడపరాదన్నారు. లైసెన్స్ ఉంటేనే వాహనాలను నడపాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇచ్చిన వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. అనంతరం హెల్మెట్ ధరించడంతో కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

మెడిసిన్ విద్యార్థులకు తీరని అన్యాయం



గత ప్రభుత్వం ప్రకటించిన మెడికల్ కళాశాలలను దృష్టిలో పెట్టుకుని నా కుమార్తెను సైన్స్ చదివిస్తున్నాను. ప్రభుత్వం మారడంతో మా అమ్మాయిని డాక్టర్‌ను చేయాలన్న మా కుటుంబ సభ్యుల ఆశలు ఆవిరయ్యాయి. ప్రభుత్వాలు మారినా మంచి పనులు, మంచి కార్యక్రమాలు మారకూడదు. మంచిని అందరూ సమర్థించాలి. అలాకాక ఎవరి మీదో కోపంతో మాలాంటి పేదలకు అన్యాయం చేయడం సరికాదు. ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కాలేజీలపై తిరిగి పరిశీలించాలి. – ఎస్.బాలరాజు, పుత్తూరు.



ప్రభుత్వం మారడంతోనే ఈ తలనొప్పి



ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయంతో పేద విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడింది. నేటి ప్రభుత్వ విధానం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసినట్లే ఉంది. గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తామని చెప్పి, ఐదింటిని ప్రారంభించారు. దీంతో మా అమ్మాయి తప్పక డాక్టర్ అవుతుందని ఆశించాం. ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తామనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. ప్రభుత్వం మారకుండా ఉన్నట్లైతే ఈ తలనొప్పి ఉండేదే కాదు. – ఎ.జయమ్మ, పుత్తూరు.

సారా.. జోరు

సారా.. తయారీ, అమ్మకంపై నిషేధం ఉన్నా.... ఇవేవీ పట్టనట్లు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వం నాటు సారా తయారీదారులపై ఉక్కుపాదం మోపారు. దీంతో నాటుసారా తయారు చేయాలన్నా, విక్రయించాలన్నా గుండెల్లో వణుకు పుట్టేవి. అయితే కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టాక తిరిగి నాటు సారా తయారీ ఊపందుకుంది. గతంలో ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో రహస్యంగా ఎప్పుడో ఒకసారి బట్టీలను ఏర్పాటు చేసి నాటుసారా కాసేవారు. అయితే ప్రస్తుతం సారాకు డిమాండ్ అధికంగా ఉండడంతో తయారీ కేంద్రాలకు పలు గ్రామాలు అడ్డాగా మారాయి. కొన్ని గ్రామాల్లో అయితే 10కి పైగా కేంద్రాలు ఉన్నాయంటే తయారీ ఏ స్థాయిలో జరుగుతుందో తెలుసుకోవచ్చు. కొన్ని గ్రామాల్లో సారా తయారీ ఓ కుటీర పరిశ్రమగా మారింది. ఉపాధితోపాటు రూ.లక్షలు తెచ్చిపెడుతుండడంతో ఎక్కువమంది దీని తయారీవైపు వెళ్తున్నారు. తయారీదారులకు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో పోలీసులు, సెబ్ అధికారులు తూతూమంత్రంగా దాడులు, కేసులకు పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. సారాతో.. తయారీదారులు, వారికి అండగా ఉంటోన్న అధికార పార్టీ నేతలు, అడ్డుకోవాల్సిన అధికారులు రూ.లక్షలు సంపాదిస్తుండగా.. తాగిన వారు రోగాల బారిన పడుతున్నారు. – విజయపురం

- ఏరులై పారుతున్న నాటుసారా
- బట్టీల నిర్వాహకులపై నామమాత్రపు కేసులు
- విజయపురానికి ముగ్గురు మొనగాళ్లు



విజయపురం మండలం ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రాంతానికి ఆనుకుని ఉంది. ఇక్కడ తయారు చేసే సారాకు తమిళనాడులో మంచి గిరాకీ ఉంటుంది. దీన్ని అవకాశంగా తీసుకొని గ్రామాల్లో నాటుసారాను కుటీర పరిశ్రమలా మలచుకొన్నారు. తక్కువ పెట్టుబడి.. కొంచెం రిస్క్... ఎక్కువ లాభాలు ఉండడంతో ఎక్కువ మంది నాటు సారా తయారీ వైపు మొగ్గుచూపుతున్నారు. పనులు లేక కొందరు.. ఉన్నా చాలీచాలనీ కూలీలు వస్తుండడంతో మరికొందరు.. సారా తయారీ, రవాణా, అమ్మకం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులు, సెబ్ అధికారుల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా అధికార పార్టీ నేతలకు అడిగినంత ముట్టజెబుతున్నారు. దీంతో పోలీసులు, సెబ్ అధికారులు తూతూమంత్రంగా దాడులు.. నామమాత్రపు కేసులతో సరిపెడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో సారా తయారు చేస్తున్న ఫిర్యాదులు వస్తున్నా వారికి అధికార పార్టీ అండ ఉండడంతో అధికారులు దాడులు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. మరికొందరు అధికారులు ఇదే అవకాశంగా తయారీదారుల నుంచి ముడుపులు తీసుకుంటూ ఉదాసీనంగా ఉంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా నాటుసారా తయారీ, అమ్మకం చేస్తూ పట్టుబడితే అధికార పార్టీ నేతలు సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చి విడిపిస్తుండడంతో నాటుసారా తయారీ మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లుతోంది.

ముగ్గురు మొనగాళ్లు

విజయపురం మండలంలో నాటు సారా తయారీ పెరగడానికి ముగ్గురు మొనగాళ్లే సూత్రధారులు. విజయపురం దళితవాడ పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉంది. ఈ ఊరులో ముగ్గురు మొనగాళ్లు ఉన్నారు. వీరికి అధికార పార్టీ నాయకులు, సెబ్ అధికారులు సహకారం ఉందని గుస గుసలు వినిపిస్తున్నాయి. వీరు కనుసైగలోనే నాటుసారా జరుగుతున్నాయి. వీరు చెప్పిందే శాసనంగా నాటుసారా తయారీ జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నాటు సారా తయారీకి ప్రధానమైనది బెల్లం. అయితే ఈ బెల్లం మొత్తం పైన తెలిపిన ముగ్గురే సరఫరా చేస్తున్నారని తెలుస్తోంది. తిరుత్తణి, కనకమ్మసత్రం నుంచి ఎస్ఎస్‌కండ్రిగ, శివాడ మీదుగా విజయపురం చేరుతున్నాయి. రాత్రి పూట మినీ వ్యాన్ ద్వారా తయారీదారుల ఇంటికి నేరుగా అందిస్తున్నారని, అధికారుల అండదండలతోనే బెల్లం సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్యాకెట్లు కాదు.. బాటిళ్లలో ...

నాటుసారా గతంలో ప్యాకెట్లలో ఉత్పత్తి చేసేవారు. అయితే రవాణా కష్టంగా ఉందని తయారీదారులు రూటుమార్చి కొత్తతరహాలో వాటర్ బాటిళ్లలో నింపేసి గుట్టుగా తరలించేస్తున్నారు. సారాను లీటర్, అర లీటర్ బాటిళ్లలో తరలిస్తున్నారు. పెద్దమొత్తంలో ఆర్డర్లు వచ్చినప్పుడు సారాను 20 లీటర్ల వాటర్ క్యాన్లలో నింపి, గుట్టుగా రవాణా చేస్తున్నారు. ఇలా వేలాది లీటర్ల నాటుసారా మండలంలో ఎక్కడకి కావాలంటే అక్కడకు తరలిపోతోంది.

ప్రాణాలతో చెలగాటం

సారా తయారీదారులు మందుబాబుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నాటు సారాతో లివర్ త్వరగా పాడైపోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయినా పోతే ప్రజల ప్రాణాలే కదా మాకు వచ్చేవి వస్తున్నాయి కదా అన్న ధోరణిలో అటు తయారీదారులు.. ఇటు అధికారులు ఉన్నారు. సారా తయారీకి అలవాటు పడిన కుటుంబాలు ఇంకోపని చేయడానికి ఇష్టపడడంలేదు. ఒకరోజు కష్టపడి నాటు సారా తయారు చేస్తే నెలకు సరిపడా సంపాదించుకోవచ్చని సారా వైపే మొగ్గుచూపుతున్నారు. పలు గ్రామాల్లో సారా తయారీ విచ్చలవిడిగా జరుగుతున్నా అధికారులు నామమాత్రపు దాడులకే పరిమితమవుతున్నారు. ఒకవేళ ఎక్కడైనా తయారీదారులు, అమ్మకందారులను పట్టుకున్నా నామమాత్రపు కేసులతో సరిపెడుతున్నారు. ఒకరిద్దరిపై నెట్టేసి మిగిలిన వారు యథాప్రకారం సారా కాస్తూనే ఉన్నారు. పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చినా మరలా అదే వృత్తిని కొనసాగిస్తున్నారు.

వాగులు, వంకలు... కేరాఫ్ నాటుసారా

వాగులు, వంకల్లోని ప్రాంతాలు నాటుసారా తయారీ కేంద్రాలకు నెలవుగా మారాయి. మండలాల పరిధిలోని విజయపురం, కేవీపురం, కలియంబాకం గ్రామాల్లో నాటుసారా గుప్పుమంటోంది. ఈ గ్రామ సమీపమంతా అటవీ ప్రాంతం కావడంతో పెద్దఎత్తున నాటు సారా తయారు చేస్తున్నారు.

కొత్త టెక్నాలజీతో సారా తయారీ

గతంలో ఊరి వెలుపల తోపుల్లో, పొలాల్లో రహస్యంగా కాపు సారా కాసేవారు. ఇందుకు కుండలు, కట్టెలను వినియోగించేవారు. పాత విధానాలకు స్వస్తి చెప్పి సాంకేతికతను వినియోగిస్తున్నారు. కలియంబాకంలో కట్టెలకు బదులు గ్యాస్ సిలిండర్‌ను, మట్టి కుండల స్థానంలో మెటల్ పాత్రలను వినియోగించి సారా కాస్తున్నారని సమాచారం. గ్యాస్ వినియోగించడంతో తక్కువ సమయంలో, ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేస్తున్నారు. ఏదైనా శుభ, అశుభ కార్యక్రమం ఉన్నా తయారీదారులకు పండుగే పండుగ, ఇంత జరుగుతుంటే సెబ్, పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలి



విద్యార్థులకు కథల పుస్తకాలు పంపిణీ

పాలసముద్రం: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుంటే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొండూరు మోహన్‌కుమార్ రాజు తెలిపారు. మంగళవారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇన్‌చార్జీ హెచ్ఎం రఘు ఆధ్వర్యంలో పాఠశాలల్లో విద్యార్థులు నేర్చుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. విచ్చేసిన మోహన్‌కుమార్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాపోటీల కూడా ముందంజలె ఉండాలని తెలిపారు. విద్యార్థి దశలోనే పుస్తకాలు, దిన పత్రికలు, కథల పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తకాలు చదవడంతో ఉల్లాసంగా ఉండేందుకు, తెలివితేటలను ఉంచేందుకు దోహదపడుతుందని తెలిపారు. అనంతరం ఆయన సొంత ఖర్చుతో పచ్చనాకు సాక్షిగా సినబ్బ కథల పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, గోవర్ధన్, ఏలుమలై, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

వెదురుకుప్పం: భావితరాల బంగారు భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. మంగళవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్ తగ్గించే క్రమంలో మొక్కలు పెంచాలన్నారు. మానవ మనుగడకు గాలి, నీరు, చెట్టు విశిష్టత తప్పనిసరి అన్నారు. కన్నతల్లి ప్రేమతో ఒక్కో మొక్కను నాటి పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు.

వినాయకునికి సాంస్కృతిక నీరాజనం



కళాకారుల నృత్య ప్రదర్శన

ఐరాల/తవణంపల్లె: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలలో కళాకారులు స్వామివారికి సాంస్కృతిక ప్రదర్శనలతో నీరాజనం పట్టారు. స్వామివారి ప్రత్యేక ఉత్సవాలలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, ప్రదర్శించిన భరతనాట్యం, పౌరాణిక నాటకం భక్తులకు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ గురుప్రసాద్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంతోనే విద్యాభివృద్ధి సాధ్యం

గంగాధరనెల్లూరు: మండలంలోని ఆగరమంగళం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఎంఈఓ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంతోనే విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జీవలక్ష్మి, యమున, త్రిపుర సుందరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో...

శ్రీరంగరాజపురం: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ సందీప్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించి విద్యార్థులకు నులిపురుగులతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలు వాడాలన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా గణాంక అధికారి జార్జి, ఆర్‌సీహెచ్ రామ్‌మోహన్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం వెంగళరాజుకుప్పం సచివాలయం, వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను వారు సందర్శించారు. విద్యార్థులతో వారు మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు, చిక్కి తదితర పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, అప్పుడే రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గదన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు వేస్తున్న టీకాల రిజిస్టర్‌ని తరవుగా పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందులతో జార్జి మాట్లాడుతూ మాతా శిశు మరణాలు అరికట్టాలని. అందువలనే ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి గర్భిణులు, బాలింతల ఆరోగ్యాలను రెండు రోజులకొకసారి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలన్నారు. అనంతరం విద్యార్థులకు హెచ్‌బీ(రక్త పరీక్షలు) చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఏఎన్ఎం గంగా గౌరి, రాధ, విజయలక్ష్మి, ఎమ్ఎల్‌హెచ్‌పి, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్వచ్ఛత దిశగా అడుగులు

చిత్తూరు అర్బన్ : నగరవాసులు స్వచ్ఛత దిశగా అడుగులు వేయాలని మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరపాలక కార్యాలయ ఆవరణంలో అధికారులు, ఉద్యోగులు ×స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను, తమ ప్రాంతాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోనూ అక్టోబర్ 2వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. నగరపాలక అధికారులు, ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు, యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఎంఈ గోమతి, డీఈ వెంకట ప్రసాద్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: ప్రతి పల్లెను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మంగళవారం పూతలపట్టులో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా మానవహారంగా ఏర్పడ్డారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రీన్ అంబాసీడర్లకు జెడ్పీ సీఈఓ గ్లోరియాతో కలిసి కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ లక్ష్మీ, ఎంపీడీఓ ధనలక్ష్మీ, తహసీల్దార్ గురప్ప, సీఐ కృష్ణమోహన్, స్థానిక నేత దొరబాబు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

చిత్తూరు కార్పొరేషన్ : నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో మంగళవారం ప్రధానమంత్రి పుట్టిన రోజు సందర్భంగా జన జాగృతి సంస్థ, బీజేపీ నేత చిట్టిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు చేతులమీదుగా భవిష్య మార్గదర్శనం పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ హేమలత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, నేతలు గురజాల చెన్నకేశవనాయుడు, సుబ్బారెడ్డి బ్రహ్మానందరెడ్డి, హరిబాబు చౌదరి పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

విజయపురం: భోజనం ముందు, తరువాత చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మంగళవారం డీవార్మింగ్ డే సందర్భంగా విజయపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రతతో నులిపురుగులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రధానంగా పిల్లలలో ఇది అధికంగా కనిపిస్తుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరు మూత పెట్టిన ఆహారం తీసుకోవాలి, బహిరంగ ప్రదేశాలలో విక్రయించే తినుబండారాలు, ఆహారం తీసుకోకూడదన్నారు. కడుపులో నులిపురుగులు ఉంటే రక్తహీనతకు దారితీస్తాయని తెలిపారు. మొత్తం 3742 మంది పిల్లలకు గాను 3585 మందికి మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేంద్రకుమార్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకే ఆల్బెండజోల్





కార్వేటినగరం: ఆల్బెండజోల్ గుళికలను విద్యార్థులకు అందిస్తున్న వైద్య సిబ్బంది, నగరి: ఆల్బెండోజోల్ అందిస్తున్న ఎంఈవో

నగరి: నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో శ్రీదేవి తెలిపారు. మంగళవారం నగరి మున్సిపాలిటీ పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆమె నులిపురుగుల నివారణ మందులు (ఆల్బెండోజోల్) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కడుపులో ఉన్న నులిపురుగుల నివారణకు ఈ ఆల్బెండజోల్ మాత్రలు పనిచేస్తాయని, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సున్న పిల్లలందరికీ ఈ మాత్రలను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నింద్రలో...

నింద్ర: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని నింద్రలో మంగళవారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ అరుణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ విద్యార్థులు, పిల్లలు అపరిశుభ్రమైన ఆహారం తీసుకోవద్దన్నారు. అనంతరం విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు సుమలత, వినీషా, ఎంఈఓ వసుమతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: నులిపురుగులను నివారించాలని వెదురుకుప్పం సర్పంచ్, వైఎస్ఆర్ సీపీ నాయకురాలు ఎం.శిల్ప అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఎర్రసానమ్మ, ఆశ వర్కర్ గీత, అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా బలిజకండ్రిగ, పాలసముద్రం ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు ఎంపీడీఓ రామనాథరెడ్డి, ఎంఈఓ గిరిజ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణకు మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులకు మాత్రలు మింగించారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించి, సిరప్‌ను తాగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా, విద్యార్థులకు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ఆల్బెండజోల్ గుళికలతో నులిపురుగుల నివారణ సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సహకారంతో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు నులిపురుగుల గుళికలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులు రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొని, నివారణకు సహకరించాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలు కనీసం ప్రతి ఆరు నెలలకోసారి తీసుకుంటే ప్రమాదకరమైన నులిపురుగులను సులభంగా అరికట్టవచ్చన్నారు. వైద్య సిబ్బంది విద్యార్థులకు ఆల్బెండజోల్ గుళికలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలసుబ్రమణ్య ఆచారి, సీఎస్ లత, అధ్యాపకులు, వైద్య సిబ్బంది శిరీష, మంజుల తదితరులు పాల్గొన్నారు.







పాలసముద్రం: నులి పురుగుల మాత్రలను మింగిస్తున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి, నింద్రలో..., వెదురుకుప్పం: మాట్లాడుతున్న సర్పంచ్ శిల్ప